## రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు : ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 7: రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దని ఎస్పీ నరసింహ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ధాన్యం రోడ్లపై ఆరబోయడంతో వాహనదారులు గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. గతేడాది ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై రాత్రి సమయంలో చివ్వెంల నుంచి వట్టిఖమ్మంపహాడ్ వైపు వెళ్తూ రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యాన్ని గమనించక ప్రమాదానికి గురై మరణించినట్లు తెలిపారు. అదేవిధంగా తుంగతుర్తిలో ఒకరు, సూర్యాపేట రూరల్ మండలంలోని బాలెంలలో ఒకరు ఇలా ధాన్యం గమనించక ప్రమాదాలకు గురై మరణించారని గుర్తు చేశారు. పోలీసుల సూచనలను రైతులు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా రైతులకు పోలీసు అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

## ప్రజల రక్షణకు పోలీసుల కృషి : డీఎస్పీ పార్థసారథి



పోలీస్ భరోసా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ పార్థసారథి

చివ్వెంల, ఏప్రిల్ 7: ప్రజల రక్షణ, భద్రత కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని డీఎస్పీ పార్థసారథి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కుడకుడ గ్రామంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంతో పాటు కార్డన్ సెర్చ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. యువత గొడవలకు పోయి కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్‌ను కోల్పోవాల్సి ఉంటుందని, మహిళలు, చిన్నారులను వేధిస్తే జీవిత కాలం శిక్షలు పడే అవకాశం ఉంటుందని తెలిపారు. బెట్టింగ్‌లకు పాల్పడొద్దని, సైబర్ మోసగాళ్ల బారిన పడొద్దని సూచించారు. కాగా, కార్డన్ సెర్చ్‌లో భాగంగా 73 అనుమానిత వాహనాలను తనిఖీ చేసి పలు వాహనాలకు జరిమానాలు విధించారు. కార్యక్రమంలో సీఐలు వీరరాఘవులు,రాజశేఖర్, ఎస్ఐలు మహేశ్వర్, కనకరత్నం, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహా భాగ్యం

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, ఏప్రిల్ 7: ఆరోగ్యమే మహా భాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి హెల్త్ చెకప్ చేయించుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో ఆయన మాట్లాడారు. 'ఆరోగ్యకరమైన ప్రారంభం– ఆశాజనక భవిష్యత్తు' అనే థీమ్‌తో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తల్లులు, నవజాత శిశువుల ఆరోగ్యం, మనుగడను మెరుగు పర్చడంపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. మనం తినే ఆహారంపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఆరోగ్యం, మంచి అలవాట్లపై ప్రజలకు తెలిసే విధంగా ప్రచారం నిర్వహించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో హెల్త్ క్యాంప్ నిర్వహించి ఉద్యోగులందరికీ పరీక్షలు చేయాలని చెప్పారు. ఎండాకాలంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు నీళ్లు తాగుతూ ఉండాలని సూచించారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఉపాధి హామీ పనులు జరిగే చోట తాగునీరు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు తమ పరిధిలోని వసతి గృహాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ చేయాలని చెప్పారు.

### ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి..

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరతిగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 50 దరఖాస్తులు రాగా వాటిని ఆయా శాఖల అధికారులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఎంహెచ్ఓ కోటాచలం, సీపీఓ కిషన్, డీటీడీఓ శంకర్, డీసీఓ పద్మ, డీఏఓ శ్రీధర్‌రెడ్డి, సంక్షేమాధికారులు లత, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, పరిశ్రమల అధికారి సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్లకు పోటెత్తిన ధాన్యం



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం రాశులు

సూర్యాపేట టౌన్/ తిరుమలగిరి, ఏప్రిల్ 7: సూర్యాపేట, తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్లకు వరి ధాన్యం పోటెత్తింది. యాసంగి కోతలు ప్రారంభమైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు మార్కెట్‌కు ధాన్యం తరలించారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం 40,930 బస్తాల వరి ధాన్యం వచ్చింది. మార్కెట్ అధికారులు, కమీషన్‌దారులు ధాన్యాన్ని పరిశీలించి ధరలను నిర్ణయించారు. బీపీటీ ధాన్యం క్వింటా రూ.1,829 నుంచి రూ.2,339 మధ్య ధర పలికింది. జై శ్రీరాం రకం రూ.1,506 నుంచి రూ.2,313, హెచ్ఎంటీ రకం రూ.1,508 నుంచి రూ.2,011, ఐఆర్ 64 రకం రూ.1506 నుంచి రూ.1,919 ధర పలికాయి. తిరుమలగిరి మార్కెట్‌లో ఐఆర్ 64 రకం గరిష్ట ధర క్వింటాకు రూ.1,906, కనిష్టంగా రూ.1,655 పలికింది. అదే విధంగా ఆర్ఎన్ఆర్ రకం రూ.1,909 నుంచి రూ.1,705 మధ్య పలికింది. కందులు క్వింటా రూ.6,656 నుంచి రూ.6,039 మధ్య ధర పలికాయి. మొక్కజొన్న గరిష్టంగా రూ.2,186, కనిష్టం ధర రూ.1,839 పలికింది.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య : ఎంఈఓ కాటయ్య



బడిబాట కార్యక్రమంలో ఎంఈఓ కాటయ్య, ఉపాధ్యాయులు

పాలకవీడు, ఏప్రిల్ 7: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈఓ కాటయ్య అన్నారు. మండలంలోని యల్లాపురం గ్రామంలో సోమవారం బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యూసుఫ్, ధర్మరాజు, పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ శ్రీలత పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల వేతనాలు పెంచాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రసాద్

కోదాడ రూరల్, ఏప్రిల్ 7: పార్లమెంటు సభ్యుల జీతాలను పెంచినట్లు, ఉపాధి హామీ కూలీల వేతనాలు కూడా పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్ డిమాండ్ చేశారు. కోదాడ పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన ఆ సంఘం జిల్లా వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతన చట్టం అమలు చేయాలని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిందని, 15 నెలలు గడుస్తున్నా హామీని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. పట్టణ వాసులకు కూడా ఉపాధి హామీ పథకం అమలు చేయాలని కోరారు. వర్క్‌షాప్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, మిట్టగణుపుల ముత్యాలు, బి.స్వరాజ్యం, మేదనమెట్ల వెంకటేశ్వరరావు, పులుసు సత్యం, హుసేన్, సిరికొండ శ్రీను, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, దోసపాటి భిక్షం, నారాసాని వెంకటేశ్వర్లు, బత్తుల రవి, ముత్యం, రామకృష్ణారెడ్డి, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు : డీఈ



బేతవోలు సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఈ వెంకటకృష్ణయ్య

చిలుకూరు, ఏప్రిల్ 7: వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు ట్రాన్స్‌కో హుజూర్‌నగర్ డీఈ వెంకటకృష్ణయ్య తెలిపారు. మండల పరిధిలోని బేతవోలు సబ్ స్టేషన్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో లో ఓల్టేజీ సమస్యలు రాకుండా సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయడంతో పాటు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బేతవోలు సబ్‌స్టేషన్ పరిధిలో 3 ఫేస్ లైన్, సింగిల్ ఫేస్ లైన్ వేరు చేసినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో ఏఈ రామిశెట్టి శ్రీనివాస్‌రావు, సబ్ ఇంజినీర్ పరుశురాములు, ఎస్ఎల్ఐ విజయకుమార్, విద్యుత్ సిబ్బంది ధర్మారావు, బాబురావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌కు వాటర్ ఫిల్టర్ వితరణ

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 7: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు బద్దం ప్రవీణ్‌రెడ్డి అనే వ్యక్తి ఆత్మకూర్.ఎస్ పోలీస్ స్టేషన్‌కు సోమవారం వాటర్ ఫిల్టర్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్, బద్దం లింగారెడ్డి, ఏఎస్ఐ దస్తగిరి, హెడ్ కానిస్టేబుల్ వీరారెడ్డి, కానిస్టేబుళ్లు నరేశ్, రమేశ్, మధురెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

గరిడేపల్లి, ఏప్రిల్ 7: మండల పరిధిలోని గారకుంట తండాలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు హెచ్ఎన్ఎస్ బ్రదర్స్ ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వేసవి కాలం దృష్ట్యా కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గుగులోతు నరేందర్ నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ బొబ్బ వెంకటరెడ్డి, బాలునాయక్, నాగరాజు, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## '27న బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి'



తూర్పుగూడెంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

తుంగతుర్తి, ఏప్రిల్ 7: వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ మండల పరిధిలోని మానాపురం, తూర్పుగూడెం, దేవునిగుట్ట తండా, ఎక్స్ రోడ్డు తండా గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య ఆధ్వర్యంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతయ్య మాట్లాడుతూ సభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఆయా సమావేశాల్లో బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, తునికి సాయిలు, గుండగాని దుర్గయ్య, గునిగంటి యాదగిరి, రాంలాల్, వెంకన్న, విరోజీ, సుధాకర్, దశరథ, పూర్ణనాయక్ పాల్గొన్నారు.

## 'ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల జోలికి వెళ్లొద్దు'

చిలుకూరు, ఏప్రిల్ 7: హెచ్‌సీయూ భూముల జోలికి వెళ్లమని ప్రభుత్వ పెద్దలు ప్రకటించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు ప్రజా సంఘాలు, మేధావులు ఉద్యమించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్‌సీయూ భూముల విషయంలో తన వైఖరి మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులపై జరిగిన దాడిని బీసీ సంఘాల తరపున ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు కొమ్మరాజు వెంకట్, జక్కుల రమణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలను విడుదల చేయాలి'



మునగాల: వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

మునగాల, ఏప్రిల్ 7: ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర కమిటీ నాయకుడు రెమిడ్యాల లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ రమేశ్ దీన్‌దయాల్‌కు సోమవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గత మూడు నెలలుగా వేతనాలు రాక కుటుంబ పోషణ కష్టమై ఫీల్డ్ అసిస్టెంట్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఫీల్డ్ అసిస్టెంట్లు దొడ్డారపు నాగేశ్వరరావు, సంధ్యాల శ్రీను, గంగుల శ్రీదేవి, ముత్తయ్య, వసంత తదితరులు ఉన్నారు.

అర్వపల్లి: మూడు నెలలుగా తమకు వేతనాలు రావడం లేదంటూ జాజిరెడ్డిగూడెం మండల ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ గోపికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శివ, లింగయ్య, చంద్రు, సైదులు, గంగ, సుజాత, శైలజ, మల్లయ్య, ఏడుకొండలు, పరుశురాములు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 7: సూర్యాపేట టౌన్ 1 పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ 1 ఏఈ ఆర్.సురేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ నగర్, చింతలచెరువు, భగత్‌సింగ్ నగర్, తిరుమల నగర్, అమ్మ గార్డెన్ వద్ద, ఖమ్మం రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### నాగారం మండలంలో..

నాగారం: మండలంలో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మహేంద్రకుమార్ తెలిపారు. నాగారం సబ్‌స్టేషన్ పరిధిలోని వర్ధమానుకోట, మాచిరెడ్డిపల్లి, ఫణిగిరి, మాలిపురం, గుండెపురి, పస్తాల ఫీడర్ల పరిధిలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

## 'అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్రం కుట్ర'



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

కోదాడ రూరల్, ఏప్రిల్ 7: ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వక్కంతుల కోటేశ్వరరావు, ప్రజా చైతన్య వేదిక కన్వీనర్ రాయపూడి చిన్ని, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ్డ వెంకటయ్య డిమాండ్ చేశారు. కోదాడలోని లాల్‌బంగ్లాలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నక్సలైట్ల ఎన్‌కౌంటర్ పేరుతో ఆదివాసీల హననానికి పాల్పడుతోందని ఆరోపించారు. అటవీ, ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రతోనే 2026 నాటికి అడవుల నుంచి ఆదివాసీలను గెంటేయడానికి ఆపరేషన్ కగార్‌ను తీసుకొచ్చిందని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా మంగళవారం (నేడు) హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రజా ధర్నాలో ప్రజా సంఘాల నాయకులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, విశ్రాంత హెచ్ఎం ముత్తవరపు రామారావు, ఉయ్యాల నర్సయ్య, కోటయ్య, పెద్ద స్వామి, మస్తాన్, వక్కంతుల నరసింహారావు, అలుగుబెల్లి సత్యనారాయణరెడ్డి, నాయిని వినయ్, డి.రవి, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పేకాడుతున్న ఇద్దరి అరెస్ట్

కోదాడ రూరల్, ఏప్రిల్ 7: కోదాడ పట్టణ పరిధి శ్రీరంగాపురంలోని ఓ ఇంట్లో పేకాడుతున్నారన్న సమాచారం మేరకు పట్టణ, సీసీఎస్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. గోపయ్య, గోపి అనే ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.6,900 నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

## లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు : ఎస్ఐ



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ బాలకృష్ణ

అర్వపల్లి, ఏప్రిల్ 7: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్ఐ బాలకృష్ణ హెచ్చరించారు. మండలంలో 'మన ఇసుక వాహనం' పథకంలో నడుస్తున్న ఇసుక ట్రాక్టర్లను సోమవారం తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ట్రాక్టర్లను నడుపుతున్న డ్రైవర్లను గుర్తించి జరిమానా విధించారు. అనంతరం వారికి స్టేషన్‌లో అవగాహన కల్పించారు.



కోదాడ పట్టణంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌ను ఆ బ్యాంక్ హైదరాబాద్ జోనల్ మేనేజర్ జీఎస్‌డీ.ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ కేఈ.హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఆరోగ్యంపై దృష్టి సారించాలి'



అర్వపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అర్వపల్లి, ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం అర్వపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 'ఆరోగ్యకరమైన ప్రారంభాలు– ఆశాజనక భవిష్యత్తు' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భూక్యా నగేశ్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. తల్లి, నవజాత శిశువుల ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీలో అత్యవసర ప్రసూతికి ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ర్యాలీలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చునాయక్, ల్యాబ్ టెక్నీషియన్ చొక్కయ్య, నర్సింగ్ ఆఫీసర్ కళమ్మ, గిరిజ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### నూతనకల్‌లో..

నూతనకల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు.

## ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి : పీవైఎల్

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 7: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్లగొండ నాగయ్య, డి.రవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నక్సల్స్ రహిత దేశాన్ని నెలకొల్పుతామని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. అటవీ సంపదను బడా కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర నాయకుడు బండి రవి, డివిజన్ నాయకుడు ఆలకుంట్ల లింగయ్య పాల్గొన్నారు.

## 'విద్యార్థులు మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలి'

గరిడేపల్లి, ఏప్రిల్ 7: ప్రతి విద్యార్థి మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలని ప్రముఖ మానసిక శాస్త్ర నిపుణులు డాక్టర్ స్రవంతి సూచించారు. మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన 'మానసిక వికాసం–విద్యార్థుల భవితవ్యం' కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షలు ఎలా రాయాలి, ఒత్తిడిని ఎలా జయించాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.ప్రసన్నకుమారి, కందుల శివకృష్ణ, విష్ణువర్ధన్, శైలజ, శాంతి, ప్రియ, మల్లికార్జునరెడ్డి, అనిల్, రమేశ్, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

## లింగగిరి పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి అవగాహన

హుజూర్‌నగర్ రూరల్, ఏప్రిల్ 7: తల్లీబిడ్డల బాగు ఆరోగ్యకర సమాజానికి పునాది అని మండల వైద్యాధికారి వేణుగోపాల్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లీబిడ్డల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి పాలు పట్టించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ నూర్జహాన్ బేగం, సూపర్‌వైజర్ చల్ల పద్మ, ఇందిరాల రామకృష్ణ, అలివేలు స్వరూప, లక్ష్మి, నర్సింగ్ ఆఫీసర్ మరియమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి'

నాగారం, ఏప్రిల్ 7: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎం.ఐలయ్య సూచించారు. పసునూరు గ్రామంలో సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. యువత గంజాయి, మద్యపానం వంటి వ్యసనాలకు గురికాకుండా ఉజ్వల భవిష్యత్తు కోసం చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

# 'కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి'



తుంగతుర్తిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు



పెన్‌పహాడ్: అనాజిపురంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తాసీల్దార్ లాలునాయక్

తుంగతుర్తి, ఏప్రిల్ 7: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు కోరారు. మండల కేంద్రంతో పాటు వెలుగుపల్లి గ్రామంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తాసీల్దార్ దయానందం, మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి: మండలంలోని పర్సాయపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సామేలు ప్రారంభించారు.

చిలుకూరు: మండల పరిధిలోని బేతవోలు పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాసీల్దార్ ధ్రువకుమార్ ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ బజ్జూరి రవీందర్‌రెడ్డి, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

చివ్వెంల: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు బండమీది చందుపట్ల, పిల్లలజెగ్గు తండా, జి.తిర్మలగిరి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తాసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ సంతోశ్‌కుమార్, ఏఓ వెంకటేశ్వర్లు, సీఈఓ వాసు, ఏపీఎం సైదయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మారినేని సుధీర్‌రావు, ఏఈఓలు వెంకట్‌రెడ్డి, ప్రియాంక, సీసీలు ఉపేందర్, వెంకన్న, కృష్ణారెడ్డి, మహేందర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండల పరిధిలోని అనాజిపురం, మహ్మదాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తాసీల్దార్ ధరావత్ లాలునాయక్ ప్రారంభించారు. ఏపీఎం అజయ్‌నాయక్, ఏఓ అనిల్‌నాయక్, ఏఈఓ స్వప్న, సీసీ షేక్ ఆశ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్: మండలంలోని పిల్లలమర్రి, గాంధీనగర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను తాసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి ప్రారంభించారు.

ఆత్మకూర్.ఎస్: మండల కేంద్రంతో పాటు నెమ్మికల్, రామోజీతండా, మిడతనపల్లి, రామన్నగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్ విండో చైర్మర్ కొణతం సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో తాసీల్దార్ హరికిశోర్‌శర్మ, డిప్యూటీ తాసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, ఏఓ దివ్య తదితరులు పాల్గొన్నారు.

మోతె: మండల పరిధిలోని బీక్యా తండాలో కొనుగోలు కేంద్రాన్ని డిప్యూటీ తాసీల్దార్ లావణ్య ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సుజిత్, ఆర్ఐ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతుకు న్యాయం చేస్తాం

- హుజూర్‌నగర్ ఏడీఏ రవి



నేరేడుచర్ల వ్యవసాయ కార్యాలయంలో విచారణ చేపడుతున్న ఏడీఏ రవి

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

నేరేడుచర్ల, ఏప్రిల్ 7: నకిలీ కలుపు మందు వాడి పంట నష్టపోయిన రైతుకు న్యాయం చేస్తామని హుజూర్‌నగర్ ఏడీఏ రవి తెలిపారు. ఈ నెల 7న నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన 'రైతును నిండా ముంచిన నకిలీ కలుపు మందు' అనే కథనానికి ఆయన స్పందించి నేరేడుచర్ల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మండలంలోని యల్లారం గ్రామానికి చెందిన గజ్జి శ్రవణ్ కౌలుకు తీసుకొని సాగు చేసిన 7 ఎకరాల్లో ముకుందాపురం గ్రామంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో కలుపు మందు కొనుగోలు చేశాడని తెలిపారు. కలుపు మందును పొలంలో పిచికారీ చేయగా పంట ఎదుగుదల లేకుండా ఎండి పోయిందని, ఆ ఫర్టిలైజర్ దుకాణ యజమానిపై వచ్చిన ఆరోపణల మేరకు దుకాణానికి సంబంధించిన పత్రాలను స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సమర్పించాలని యజమానిని ఆదేశించినట్లు పేర్కొన్నారు. పంట దిగుబడి కోసం ఏయే మందులు వాడారనే విషయాన్ని రైతును అడిగి తెలుసుకున్నామని, దానికి సంబంధించిన బిల్లులను తీసుకొచ్చి సమర్పించాలని కోరినట్లు వివరించారు. ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టడంతో పాటు కలుపు మందు కంపెనీ వివరాలను సేకరిస్తున్నామని వెల్లడించారు. పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని పేర్కొన్నారు. వారి ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏడీఏ వెంట నేరేడుచర్ల ఏఓ జావీద్, ఏఈఓలు అన్వేశ్, నిర్మల ఉన్నారు.